మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

బాపట్ల | గుంటూరు | పల్నాడు

గురువారం 4 జూన్ 2026 పేజీలు : 4


## ఆరోగ్య రంగంలో గుంటూరుకు మరో మైలురాయి

ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యవంతమైన ప్రజలతోనే సంపన్న రాష్ట్రం, దేశం నిర్మాణం సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గుంటూరులో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన లలితా ఆసుపత్రిని ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు.

- లలితా ఆసుపత్రి ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- అత్యాధునిక వైద్య సేవలతో వైద్య కేంద్రంగా గుంటూరు ఎదుగుతుందని ఆశాభావం



గుంటూరు, రక్షణ న్యూస్:

వివరాలు 2లో..

## సీఐ చిన్న మల్లయ్య డిస్మిస్...



వివరాలు 2లో..

- మహిళ ఫిర్యాదు తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిన అధికారి...
- సుప్రీం, హైకోర్టు బెయిల్ తిరస్కరణలు.
- కఠిన చర్యలకు దిగిన ఉన్నతాధికారులు...

వినుకొండలో నమోదైన అత్యాచారం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ చిన్న మల్లయ్యను పోలీస్ శాఖ శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించినట్లు సమాచారం. మహిళ ఫిర్యాదు తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిన మల్లయ్యకు హైకోర్టు, సుప్రీంకోర్టులోనూ ఊరట లభించ కపోవ డంతో పాటు, నెల రోజులకుపైగా విధులకు హాజరు కాకపోవడంతో ఉన్నతాధికారులు డిస్మిస్ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

ఉమ్మడి గుంటూరు క్రైమ్ బ్యూరో...

## సాంకేతిక జాడలో దొంగ బండి..!

- ఆర్ టి జి ఎస్ సహాయంతో వాహానం కదలికల గుర్తింపు...
- నిఘా కెమెరాలు, డిజిటల్ పర్యవేక్షణలో కేసు....
- పోలీసుల సమన్వయంతో 15 రోజుల్లో కేసు ఛేదన

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తే నేరస్తులు ఎంత దూరం పారి పో యినా తప్పించుకోలేరని పాతగుంటూరు పోలీసులు మరోసారి నిరూపించారు. ద్విచక్ర వాహనం దొంగతన కేసులో రియల్ టైమ్ పరి పాలనా వ్యవస్థను వినియోగించి వాహనం కదలికలను గుర్తించారు. నిఘా కెమెరాల చిత్రా లను విశ్లేషిస్తూ, జిల్లాల మధ్య పోలీసుల సమన్వ యంతో నిందితుడి అడుగు జాడలను వెంబడి ంచి చివరకు వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన పోలీసు శాఖలోనే కాక ప్రజల్లోనూ చర్చనీయాంశమైంది.




గుంటూరు క్రైమ్ బ్యూరో....

వివరాలు 2లో..

## సాగర్ కాలువల పనులకు రూ.42 కోట్ల మంజూరు

### 578 నిర్వహణ పనులకు ఏపీ ప్రభుత్వ అనుమతి

### డీసిల్టింగ్ పనులతో రైతులకు ఊరట...



అమరావతి, రక్షణ న్యూస్...

వివరాలు 3లో..

నాగార్జున సాగర్ కాలువల పరిధిలో సాగునీటి సరఫరాను మరింత సమర్థవంతంగా మార్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 సంవత్సరానికి చేపట్టనున్న 578 ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులకు రూ.42.19 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 6/4/2026 5:17 AM Page 2



## ఆరోగ్య రంగంలో గుంటూరుకు మరో మైలురాయి

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు, రక్షణ న్యూస్:**

దశాబ్దాలుగా వైద్య రంగంలో సేవలందిస్తున్న లలితా గ్రూప్ గుంటూరులో 600 పడకలతో, 32 ప్రత్యేక విభాగాలతో కూడిన అత్యాధునిక ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా అత్యాధునిక ఎంఆర్ఐ స్కానింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురా వడం విశేష మన్నారు. కార్డియాలజీ, న్యూరాలజీ, జాయింట్ రీప్లేస్‌మెంట్ వంటి విభాగాల్లో ఈ ఆసుపత్రి సేవలు అందించనున్నట్లు తెలిపారు.ఒకప్పుడు హైదరాబాద్‌ను హెల్త్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసినట్లు గుర్తు చేసిన ముఖ్యమంత్రి, భవిష్యత్తులో అమరావతి కూడా అంతర్జాతీయ వైద్య సేవల కేంద్రంగా ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి రోగులు అమరావతికి వచ్చి చికిత్స పొందే రోజులు త్వరలోనే వస్తాయని అన్నారు.ప్రజలకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 'సంజీవని' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ హెల్త్ రికార్డులు, ఇంటి వద్దే 42 రకాల వైద్య పరీక్షలు, ముందస్తు ఆరోగ్య హెచ్చరికలు, అవసరమైన వైద్య సూచనలను ఈ కార్యక్రమం ద్వారా అందించనున్నట్లు చెప్పారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానాల ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు.యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద ప్రతి కుటుంబానికి రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఆసుపత్రులకు వెళ్లే పరిస్థితి రాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మంచి ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, యోగా, ప్రాణాయామం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు .ఆహారపు అలవాట్లలో మార్పులు, అధిక రసాయనాల వినియోగం, క్రిమిసంహారక మందుల ప్రభావం ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. "ఫుడ్ ఈజ్ మెడిసిన్, కిచెన్ ఈజ్ ఫార్మసీ" అనే భావనతో ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.లలితా ఆసుపత్రి భవిష్యత్తులో గుంటూరుకు ల్యాండ్‌మార్క్ వైద్య సంస్థగా ఎదిగి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## చందోలు ఎస్సైగా కే. మాధవరావు....




**పిట్టలవాణి పాలెం రక్షణ న్యూస్....**

పిట్టలవానిపాలెం మండల పరిధిలోని చందోలు పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా కే. మాధవరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్సై కే. మాధవరావు మాట్లాడుతూ ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, మహిళల భద్రత విషయంలో కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.ప్రజలు ఎటువంటి సమస్యలైనా నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలపై సమాచారం అందిస్తే వెంటనే స్పందించి చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజల సహకారంతో చందోలు పరిధిలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేస్తామని ఎస్సై పేర్కొన్నారు.

# సీఐ చిన్న మల్లయ్య డిస్మిస్..

మొదటి పేజీ తరువాయి

**ఉమ్మడి గుంటూరు క్రైమ్ బ్యూరో...**

పల్నాడు జిల్లాలో సంచలనం రేపిన సీఐ చిన్న మల్లయ్య అత్యాచారం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వినుకొండలో మహిళపై అత్యాచారం చేశాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ చిన్న మల్లయ్యను పోలీస్ శాఖ ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించినట్లు విశ్వసనీయ సమాచారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు ఐజీ స్థాయిలో ఉత్తర్వులు జారీ కాగా, అవి పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరినట్లు సమాచారం.గతంలో వినుకొండ, నరసరావుపేట, కారంపూడి ప్రాంతాల్లో సీఐగా పనిచేసిన చిన్న మల్లయ్యపై ఏప్రిల్ 29న ధనలక్ష్మి అనే మహిళ వినుకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనపై చిన్న మల్లయ్య బలవంతంగా అత్యాచారం చేశాడని ఆమె ఆరోపించింది. మహిళ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు చిన్న మల్లయ్యపై అత్యాచారం కేసు నమోదు చేశారు.కేసు నమోదు అయిన వెంటనే చిన్న మల్లయ్య అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. పోలీసులు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టగా, మరోవైపు చిన్న మల్లయ్య తన న్యాయవాదుల ద్వారా ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించాడు. అయితే కేసు తీవ్రత, మహిళ చేసిన ఆరోపణల నేపథ్యంలో హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.అనంతరం చిన్న మల్లయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ అక్కడ కూడా ఊరట లభించలేదు. సుప్రీంకోర్టు కూడా ముందస్తు బెయిల్ మంజూరు చేయకుండా పిటిషన్‌ను కొట్టివేసినట్లు సమాచారం. దీంతో చిన్న మల్లయ్యపై అరెస్ట్ భయం మరింత పెరిగింది.ఇక కేసు నమోదైన తర్వాత నుంచి చిన్న మల్లయ్య విధులకు పూర్తిగా దూరంగా ఉన్నాడు. నెల రోజులకుపైగా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గైర్హాజరవడం, కేసులో పరారీలో ఉండటం, న్యాయపరమైన విచారణను ఎదుర్కొనకుండా తప్పించుకోవడం వంటి అంశాలను తీవ్రంగా పరిగణించిన పోలీస్ ఉన్నతాధికారులు అతనిపై శాఖాపరమైన చర్యలు ప్రారంభించారు.ఈ క్రమంలోనే పోలీస్ శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ప్రవర్తించాడనే కారణంతో చిన్న మల్లయ్యను శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

పోలీస్ అధికారిపై అత్యాచారం ఆరోపణలు రావడం, కేసు నమోదు తర్వాత పరారీలోకి వెళ్లిపోవడం, రెండు అత్యున్నత న్యాయస్థానాల్లోనూ బెయిల్ తిరస్కరణకు గురికావడం వంటి పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. బాధిత మహిళకు న్యాయం చేయాలని మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు అప్పట్లో పెద్దఎత్తున డిమాండ్ చేశాయి.ప్రస్తుతం చిన్న మల్లయ్య ఎక్కడ ఉన్నాడన్న అంశంపై స్పష్టత లేకపోయినా, అతడిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో మరిన్ని కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని పోలీస్ వర్గాలు చెబుతున్నాయి.

# సాంకేతిక జాడలో దొంగ బండి..!

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు క్రైమ్ బ్యూరో....**

గుంటూరు నగరంలోని పాతగుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అరుంధతి నగర్ తొలి వీధికి చెందిన వ్యక్తి తన ఏపీ 40 జేఎన్ 9983 నంబరు గల సుజుకి యాక్సెస్ ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు నిలిపి ఉంచాడు. మే 16 ఉదయం లేచి చూసేసరికి వాహనం కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఎలాంటి సమాచారం దొరకలేదు. దీంతో బాధితుడు మే 23న పాతగుంటూరు పోలీసులను ఆశ్రయించాడు.

ఫిర్యాదు అందుకున్న వెంటనే పాతగుంటూరు ఇన్స్పెక్టర్ కె. వెంకటప్రసాద్ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్నారు. సాధారణ విచారణకు భిన్నంగా సాంకేతిక ఆధారాలపై దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం వినియోగిస్తున్న రియల్ టైమ్ పరిపాలనా వ్యవస్థ సహాయంతో వాహనం కదలికలను పరిశీలించడం ప్రారంభించారు.ఈ పరిశీలనలో కీలక సమాచారం లభించింది. దొంగిలించబడిన వాహనం మే 22న ఇబ్రహీంపట్నం ప్రాంతంలో సంచరించినట్లు గుర్తించారు. వెంటనే ప్రత్యేక పోలీసు బృందాలను అక్కడికి పంపించారు. హెడ్ కానిస్టేబుళ్లు మోహన్‌బాబు, నూరుద్దీన్‌తో పాటు ఇతర సిబ్బందిని అప్రమత్తం చేశారు. అదే సమయంలో ఇబ్రహీంపట్నం పోలీసులను సంప్రదించి సహకారం కోరారు.ఇబ్రహీంపట్నం పోలీసులు కూడా వెంటనే స్పందించారు. రెండు ప్రాంతాల పోలీసులు కలిసి వాహనం ప్రయాణించిన మార్గాలను గుర్తించారు. ప్రధాన రహదారులు, పెట్రోలు నిలయాలు, కూడళ్లు, దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన నిఘా కెమెరాల చిత్రాలను గంటలకొద్దీ పరిశీలించారు. చివరకు ఒక వ్యక్తి ఆ వాహనాన్ని నడుపుతున్న దృశ్యాలు స్పష్టంగా కనిపించాయి.

మే 28న పోలీసులు అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆచి డేవిడ్ రాజు అలియాస్ డేవిడ్ రాజ్ అనే వ్యక్తి మే 15 అర్ధరాత్రి గుంటూరుకు వచ్చి, మరుసటి రోజు తెల్లవారుజామున అరుంధతి నగర్ ప్రాంతంలో నిలిపి ఉంచిన వాహనాన్ని దొంగిలించినట్లు అంగీకరించాడు. అనంతరం ఇబ్రహీంపట్నం వెళ్లి కేవలం ఐదు వేల రూపాయలకు వాహనాన్ని విక్రయించినట్లు తెలిపాడు.అయితే ప్రధాన నిందితుడు పరారీలో ఉండటంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. రియల్ టైమ్ పరిపాలనా వ్యవస్థ ద్వారా అతని కదలికలను మళ్లీ పరిశీలించారు. నిఘా కెమెరాల ఆధారాలు, చరవాణి స్థానం వివరాలు, స్థానిక సమాచారాన్ని అనుసంధానం చేస్తూ ఐదు రోజులపాటు గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు మే 31న నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు.ఈ కేసులో అత్యంత కీలకంగా మారింది సాంకేతిక పరిజ్ఞానం వినియోగమేనని పోలీసులు చెబుతున్నారు. ఒకప్పుడు వాహనం దొంగిలించబడితే దాని ఆచూకీ కోసం వారాలు, నెలలు పట్టేది. కానీ ఇప్పుడు డిజిటల్ వ్యవస్థలు, నిఘా కెమెరాల వలయం, సమాచార విశ్లేషణ, జిల్లాల మధ్య సమన్వయం వల్ల గంటల వ్యవధిలోనే వాహనాల కదలికలను గుర్తించడం సాధ్యమవుతోందని అధికారులు పేర్కొంటున్నారు.ప్రస్తుతం పాతగుంటూరు పోలీస్ స్టేషన్‌లో నేర సంఖ్య 117/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ కేసును ఛేదించడంలో పాతగుంటూరు ఇన్స్పెక్టర్ కె. వెంకటప్రసాద్‌తో పాటు హెడ్ కానిస్టేబుళ్లు మోహన్‌బాబు, నూరుద్దీన్, ఇబ్రహీంపట్నం పోలీసు సిబ్బంది, పోలీసు కానిస్టేబుల్ గ్రేస్ కీలక పాత్ర పోషించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తే నేరస్తులు ఎంత తెలివిగా వ్యవహరించినా చివరకు చట్టం ముందుకు రావాల్సిందేనని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 6/4/2026 5:17 AM Page 3



# మృతికి సంతాపం

**చీరాల రక్షణ న్యూస్**

చీరాల పట్టణంలోని 29వ వార్డు హరి ప్రసాద్ నగర్‌కు చెందిన కుంచాల రాంబాబు సోదరుని కుమారుడు కుంచాల శ్రీనివాసరావు మృతి పట్ల చీరాల మాజీ శాసనసభ్యులు అమంచి కృష్ణమోహన్ సంతాపం వ్యక్తం చేశారు.మంగళవారం హరి ప్రసాద్ నగర్‌లోని శ్రీనివాసరావు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మృతుని ఆత్మకు



శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని కోరుకున్నారు.

# టిడిపి శ్రేణుల అభినందనలు

**మాచర్ల రక్షణ న్యూస్**

మాచర్ల నియోజకవర్గ టీడీపీ నాయకుడు పంగులూరి పుల్లయ్య జన్మ దినాన్ని పురస్కరించుకుని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ విజయానికి పంగులూరి పుల్లయ్య విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి ఆయన నిరంతరం శ్రమిస్తూ, అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని కొని యాడారు.భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహి ంచి, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్, వీర్ల నాగరాజు, బూత్ నెంబర్ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# సాగర్ కాలువల పనులకు రూ.42 కోట్ల మంజూరు

మొదటి పేజీ తరువాయి

**అమరావతి, రక్షణ న్యూస్...**

రాష్ట్రంలోని సాగునీటి వ్యవస్థ బలోపేతానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. నాగార్జున సాగర్ కాలువల పరిధిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి చేపట్టనున్న ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులకు రూ.42.19 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.మొత్తం 578 పనులకు పరిపాలనా అనుమతులు లభించగా, ఈ నిధులతో కాలువల నిర్వహణ, మరమ్మతులు, నీటి సరఫరా వ్యవస్థల ఆధునికీకరణ చేపట్టనున్నారు. ముఖ్యంగా కాలువల బలోపేతం, డీసిల్టింగ్, నీటి నియంత్రణ వ్యవస్థల మెరుగుదల, గేట్లు, షట్టర్ల మరమ్మతులు, కాలువ బ్యాంకుల పటిష్టీకరణ వంటి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.నాగార్జున సాగర్ కాలువల పరిధిలోని గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో సాగునీటి సరఫరా మరింత సమర్థవంతంగా జరిగేలా ఈ పనులు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించడం ద్వారా నీటి ప్రవాహం మెరుగుపడటంతో రైతులకు సమయానికి సాగునీరు అందే అవకాశం ఉందన్నారు.ప్రతి ఏడాది నిర్వహణ పనులు సకాలంలో చేపట్టకపోతే కాలువల సామర్థ్యం తగ్గిపోతుందని, నీటి వృథా పెరుగుతుందని నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తుగా నిధులు విడుదల చేయడం రైతులకు ఊరటనిచ్చే అంశమని అభిప్రాయపడుతున్నారు.ఈ పనులు పూర్తయితే సాగర్ కాలువల ద్వారా సాగునీరు అందుకునే వేలాది ఎకరాల రైతాంగానికి ప్రత్యక్ష ప్రయోజనం కలగనుంది. ఖరీఫ్, రబీ సీజన్లలో నీటి పంపిణీ మరింత సమర్థవంతంగా జరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# కార్యకర్తలే నా బలం



**పర్చూరు రక్షణ న్యూస్**

కార్యకర్తలే తన బలమని, ప్రజాసేవే తన గమ్యమని పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పార్టీ విజయానికి అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు. పర్చూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరూ సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, కార్యకర్తల గౌరవమే ప్రాధాన్యంగా తన పయనం కొనసాగుతుందని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# నూతన కార్యవర్గం ఎంపిక



**గురజాల రక్షణ న్యూస్**

గురజాల మండల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం శ్రీరాంపురంలోని విలేకరుల కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల్లో అధ్యక్షుడిగా కందుల వెంకయ్య, కార్యదర్శిగా షేక్ సుభాని, కోశాధికారిగా కనకం సుధాకర్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కమిటీ సభ్యులుగా జక్కా బలరాం, అన్నం దాసు అమరలింగేశ్వరరావు, పులిగుజ్జు రవి కిరణ్, గర్నెపూడి బాబు, చెవిటి వెంకట శివ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కందుల వెంకయ్య మాట్లాడుతూ గురజాల ప్రాంతంలోని విలేకరుల సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విలేకరుల పిల్లల ఫీజుల విషయంలోయాజమాన్యాలతో చర్చించి సహకారం అందించే ప్రయత్నం చేస్తామని చెప్పారు. అలాగే కొత్తగా జర్నలిజం రంగంలోకి వచ్చే వారితో పాటు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న విలేకరులు కూడా సంఘంలో సభ్యత్వం పొందవచ్చని వెల్లడించారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు



**చేబ్రోలు రక్షణ న్యూస్**

రాష్ట్రంలో గత రెండేళ్లుగా కొనసాగుతున్న పాలన ప్రజలను తీవ్రంగా నిరాశకు గురిచేసిందని, దుర్మార్గ, అరాచక, మాఫియా ధోరణులతో కూడిన వెన్నుపోటు పాలన సాగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ విమర్శించారు. చేబ్రోలు మండలం చేబ్రోలులో బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి "వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో రూపొందించిన పోస్టర్, బుక్‌లెట్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం అబద్ధాల ప్రచారంతో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు ప్రస్తుత పాలన పట్ల విసుగు చెందారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 6/4/2026 5:17 AM Page 4



# హామీలపై నిరసనలు



**చిలకలూరిపేట రక్షణ న్యూస్**

ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చిలకలూరిపేట నియోజకవర్గంలో రేపటి నుంచి నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి విడదల రజిని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం చిలకలూరిపేట క్యాంపు కార్యాలయంలో “వెన్నుపోటుకు రెండేళ్లు” పేరుతో రూపొందించిన పోస్టర్, బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని మూడు మండల కేంద్రాలు, పట్టణంలో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. ఇందులో భాగంగా తాను యడ్లపాడు మండల కేంద్రంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటానని చెప్పారు.

అలాగే ఈ నెల 8వ తేదీన మహిళలు, యువతతో పాటు వివిధ వర్గాల ప్రజలతో ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, ప్రజలు, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మాజీ మంత్రి విడదల రజిని కోరారు.

## యోగాంధ్ర విజయానికి సమష్టి కృషి అవసరం

### కలెక్టర్

**గుంటూరు, రక్షణ న్యూస్**



అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ సూచించారు. “యోగ ఫర్ హెల్తీ ఏజింగ్” నినాదంతో నిర్వహించే యోగాంధ్ర--2026 కార్యక్రమంపై కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న గుంటూరు వెస్ట్రన్ బైపాస్‌పై 25 వేల మందితో భారీ స్థాయిలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 3.10 కిలోమీటర్ల మేర విస్తరించిన బైపాస్‌పై యోగా కార్యక్రమం చేపట్టనున్నామని చెప్పారు. యోగాపై ఆసక్తి ఉన్నవారు, ఇప్పటికే యోగా సాధన చేస్తున్నవారు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జూన్ 7 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉండవల్లి గుహలు, మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వంటి ప్రముఖ ప్రాంతాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. యోగ పోటీల షెడ్యూల్‌ను కూడా కలెక్టర్ వివరించారు. జూన్ 7 నుంచి 9 వరకు గ్రామ, వార్డు స్థాయిలో, జూన్ 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో, జూన్ 14 నుంచి 16 వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జూన్ 18 నుంచి 20 వరకు రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని తెలిపారు. సమావేశానికి ముందు జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కలిసి వెస్ట్రన్ బైపాస్ ప్రాంతాన్ని పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్, ఆర్డీవో కె. శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ సీఈవో వి. జ్యోతి బసు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె. విజయలక్ష్మి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయలక్ష్మి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జె. పద్మ, ప్రాంతీయ పర్యవేక్షక అధికారి జి. సునీత, డిగ్రీ కళాశాలల ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కళావతి తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నివారణపై అవగాహన



**ముండ్లమూరు రక్షణ న్యూస్**

ముండ్లమూరు మండల కేంద్రంలో ప్రజలకు నేరాల నివారణ, సైబర్ మోసాలు, మహిళలు మరియు వృద్ధుల భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై దర్శి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎండ్లూరి రామారావు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. మహిళలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. నేరాల నియంత్రణలో పోలీసులకు ప్రజల సహకారం ఎంతో అవసరమని సీఐ ఎండ్లూరి రామారావు వివరించారు.

## గురువులకు గౌరవం

**ముండ్లమూరు రక్షణ న్యూస్**



ఆల్ ఇండియా ఆల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రకటించిన ఎన్టీఆర్ అవార్డులకు ముండ్లమూరు మండలానికి చెందిన నలుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వేములా జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తన్యా, ముండ్లమూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్కే మస్తాన్ వలి, ఈదర పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పి. ఆంజనేయులు, బృందావనం తండా ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు జి. శ్రీనివాసరావు ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులకు ఎంపిక య్యారు. వారి ఎంపిక పట్ల విద్యావర్గాలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులకు ఈ గుర్తింపు రావడం మండలానికి గర్వకారణమని పేర్కొంటూ పలువురు అభినందనలు తెలిపారు.

## వేపనపల్లె లో ఎస్టీ కాలనీ దారి సమస్య పరిష్కారం

**బంగారుపాళ్యం.జూన్ 3**

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారు పాలెం మండల పరిధిలోని కీరమంద పంచాయతీ వేపనపల్లి ఎస్టీ కాలనీ నందు 50 సంవత్సరాలుగా పరిష్కారం కానీ దారి సమస్యను పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, మండల పార్టీ గౌరవ అధ్యక్షులు ఎన్ పి జయప్రకాష్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు ఎన్ పి ధరణి ప్రసాద్ ఆదేశాల మేరకు కీరమంద మాజీ ఎంపీటీసీ కాయల శ్రీనివాసులు యూనిట్ ఇంచార్జ్,స్టేట్ పాల ఏకరి సాధికార సమితి సభ్యుడు వేపనపల్లె తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు బూత్ ఇంచార్జ్ హరిబాబు,బీసీ సెల్ ఉపాధ్యక్షులు కనకంటి రత్నం న్యాయని వారు ఆధ్వర్యంలో బుధవారం ఎస్టీ కాలనీ దారి సమస్య పరిష్కరించారు